
సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 13 । జనవరి । 2023



బడులు ఇక బలోపేతం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులన బలోపేతం చేసేదిశగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. 10లో▸



పకడ్బందీగా నాకాబందీ

నంబర్ ప్లేట్స్ లేని వాహనాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. జిల్లాలో నాకాబందీ నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. 10లో▸



ఊరడమ్మ ఆలయం వద్ద భక్తజన సందోహం



బోనాలు ఎత్తుకుని ఊరడమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



నృత్యం చేస్తున్న జోగిని నిషక్రాంతి

వైభవంగా బోనాలు

గౌతాపూర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఊరడమ్మ జాతరను పురస్కరించుకుని గురువారం శివసత్తుల పూనకాలతో వీధులన్నీ ఊగిపోయాయి. యువత కేరింతలు, పోతరాజుల నృత్యాలు, డప్పుల దరువుతో కాలనీలు దద్దరిల్లాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. జోగిని నిషక్రాంతి నృత్యం ఆకట్టుకుంది.

– తాండూరు రూరల్

న్యూస్‌రీల్

'కంటి వెలుగు'పై కార్యదర్శులకు అవగాహన



మోమిన్‌పేటలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్

మోమిన్‌పేట: రెండో విడత 'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ద్వారా అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరికీ నేత్ర పరీక్షలు చేయించాలని సూచించారు. చూపు లేకపోతే జీవితమంతా అంధకారమే ఉంటుందని తెలిపారు. ఈ నెల 18నుంచి అన్ని గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇందులో భాగంగా పంచాయతీలు చేపట్టే అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావీయకూడదని సెక్రటరీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.వసంత వెంకట్, ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

వికారాబాద్ అర్బన్: కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో పెట్టామని డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో వీరు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. లిస్టులో పేర్లు ఉన్న వారు డీపీఆర్సీ భవనంలో శుక్రవారం నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఫార్మా రైతులకు సరైన పరిహారం అందించాలి

యాచారం: ఫార్మా రైతులకు సరైన పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కుర్మిద్ద, మంగళిగడ్డతండాలో ఫార్మా సిటీ రైతుల సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. భూమి తీసుకునేటప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కాలుష్యం లేని కంపెనీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు సీహెచ్ జంగయ్య, సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, పి.అంజయ్య, జగన్, శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదుకు సహకరించండి

మొయినాబాద్: యాసింగిలో రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. దేవల్‌వెంకటాపూర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారులు చేపడుతున్న పంటల నమోదును గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో పంటల నమోదు ఆధారంగానే ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. అందుకే రైతులు ఏఈఓలకు సహకరించి తాము సాగుచేసిన పంటల వివరాలను సంపూర్ణంగా తెలియజేయాలని సూచించారు.

గిట్లయితె కష్టమే!

బీజేపీలో కనిపించని జోష్

- అభాసుపాలైన బూత్ కమిటీ సభ్యుల మీటింగ్
- పదిశాతం మంది కూడా హాజరు కాని వైనం
- జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయం కరువు
- కానరాని నేతల ప్రభావం
- శ్రేణులను కలుపుకొని వెళ్లడంలో విఫలం



వికారాబాద్: జిల్లాలో కమలదళం ఉనికి పెద్దగా కనిపించడం లేదు. కేడర్ పెరుగుతున్నా పార్టీ బలం పుంజుకోవడం లేదు. జిల్లాలో సమావేశాలు నిర్వహించిన ప్రతీసారి నలుమూలల నుంచి కార్యకర్తలు తరలివచ్చేవారు. దీంతో ఎక్కడ మీటింగ్ పెట్టినా సభ సక్సెస్ అనిపించేది. ఇదిలా ఉండగా ఆరు రోజుల క్రితం అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో పార్టీ సమావేశాలు నిర్వహించారు. ఒకే రోజు, ఏక కాలంలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో మీటింగ్‌లు ఏర్పాటుచేసి, బూత్ కమిటీ సభ్యులను ఆహ్వానించారు. కమలం పార్టీ అగ్ర నేతలు వర్చువల్‌గా ప్రసంగించి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావడంతో పాటు తెలంగాణలోని 90 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహరచనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే తాజాగా నియోజకవర్గాలకు కన్వీనర్లు, విస్తారక్, పాలక్ విస్తారక్, పాలక్‌లను నియమించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి ప్రాముఖ్యత పెరిగినప్పటికీ అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగడంలో జిల్లా నేతలు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కేడర్‌ను కలుపుకొని వెళ్లే నాయకులు కనిపించడం లేదు.

పదిశాతమే హాజరు

నియోజకవర్గాల వారీగా కమలదళం బలమెంతో నియోజకవర్గ స్థాయి సమావేశాలతో తేటతెల్లమైంది. జిల్లాలో ఉన్న సీనియర్ నాయకులతో పాటు మొత్తం 24,000 బూత్ కమిటీ సభ్యులు ఉన్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. వీరికోసమే ఇటీవల సమావేశాలు ఏర్పాటు చేశామని నాయకులు చెబుతుండగా.. వీరిలో పదిశాతం సభ్యులు కూడా మీటింగ్‌కు హాజరు కాలేదు. ఈనెల7న నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశాలకు వికారాబాద్ నియోజకవర్గంలో 450, కొడంగల్‌లో 400, పరిగిలో 350, తాండూరులో 150 మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు చోట్ల కలిపి వర్చువల్ మీటింగ్‌కు 1,500 మంది కూడా హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో తమ బలం పెంచుకునేందుకు బీజేపీ నాయకత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

సత్తాచాటుతారా..

జిల్లాలో మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ మొదలుకుని విఠల్, మురళీకృష్ణగౌడ్, జిల్లాలో ప్రభావం ఉంటుందనుకుంటున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వంటి నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కానీ వీరు పార్టీలో చేరింది మొదలు కేడర్‌ను పెంచుకుని, పార్టీ బలోపేతానికి చేసిన చర్యలేవీ కనిపించడం లేదు. దీంతో జిల్లాలో వీరి చేరిక అనంతరం ఎలాంటి ప్రభావం కనిపించడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇకనైనా పార్టీలో చేరిన నేతలు తమ సత్తా చాటేలా పనిచేసి, పార్టీ అభివృద్ధికి కృషిచేస్తారా..? లేదా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

'కంటి వెలుగు'కు సిద్ధంకండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నిఖిల

- ప్రతీ గ్రామంలో శిబిరాలు నిర్వహించాలి
- స్థానికులకు ముందుగానే సమాచారం అందించాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ నిఖిల ఆదేశం

వికారాబాద్ అర్బన్: అన్ని గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నిఖిల అధికారులను ఆదేశించారు. ఇందులో కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, రేషన్ డీలర్లను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ మేరకు గురువారం వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు వర్చువల్‌గా హాజరయ్యారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నేత్ర శిబిరాల వద్ద టెంట్లు, తాగునీరు, కుర్చీలు వంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఏ రోజు క్యాంప్ నిర్వహిస్తారనే విషయాన్ని గ్రామస్తులకు ముందుగానే తెలియజేయాలన్నారు. అధికారులు, సిబ్బంది వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. కంటి వెలుగుకు సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ప్రచారం చేయాలన్నారు. వృద్ధులు, పేద ప్రజలు శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వాన్ కుమార్ పాల్గొన్నారు.



టేకులపల్లిలో వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు, గ్రామస్తులు

యువతకు స్ఫూర్తి..

స్వామీవివేకానందుడి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని, ముఖ్యంగా యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంఘాల నేతలు అన్నారు. వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా గురువారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన వారిలో వివేకానందుడు ప్రథముడని కొనియాడారు.

– మోమిన్‌పేట

ప్రాణం తీసిన అర గజం స్థలం

ఇరు కుటుంబాల మధ్య రెండేళ్లుగా తగాదా

- పలుమార్లు పంచాయితీ పెట్టినా దొరకని పరిష్కారం
- బహిర్భూమికి వెళ్లిన చోట గొడ్డళ్లతో వ్యక్తిపై దాడి
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృత్యువాత
- వివరాలు వెల్లడించిన ధారూరు సీఐ, ఎస్‌ఐ



చిన్న మల్లయ్య

దారూరు: ఇంటి ఎదుట ఉన్న అర గజం స్థలం కోసం కొనసాగుతున్న వివాదం.. ఓ వ్యక్తి ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన నాగసమందర్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ తిరుపతిరాజు, ఎస్‌ఐ నరేందర్, బాధితుల వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గొల్ల చిన్న మల్లయ్య(40), మెట్లకుంట నర్సింలు ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. వీరి ఇళ్ల మధ్య ఉన్న స్థలం విషయంలో రెండేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ నిర్వహించినా వివాదం పరిష్కారం కాలేదు. పది రోజుల క్రితం ఈ విషయమై ధారూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అర గజం స్థలం విషయంలో ఎవరూ పట్టువీడలేదు. స్థలం తనదని, దాని జోలికి వస్తే చంపేస్తానని చిన్నమల్లయ్య.. నర్సింలు, అతని కుమారులను బెదిరించాడు. దీంతో మల్లయ్యను హతమార్చాలని నర్సింలు కుటుంబం నిర్ణయించుకుంది. ఈ క్రమంలో వికారాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటున్న చిన్నమల్లయ్య సంక్రాంతి పండుగకు భార్యాపిల్లలను తీసుకుని ఇంటికి వచ్చాడు. ఈ సమయం కోసమే ఎదురు చూస్తున్న నర్సింలు కుటుంబ సభ్యులు అదను కోసం కాచుకు కూర్చున్నారు. బుధవారం రాత్రి భోజనాలు చేసిన తర్వాత బహిర్భూమికి వెళ్లేందుకు మల్లయ్య గ్రామ శివారులోకి వెళ్లాడు. కాపుకాసిన మెట్లకుంట నర్సింహులు మరికొందరితో కలిసి గొడ్డళ్లు, ఇతర మారణాయుధాలతో చిన్నమల్లయ్యపై దాడి చేశారు. బయటకు వెళ్లిన భర్త అరగంట దాటినా తిరిగిరాకపోవడంతో భయపడిన సత్యమ్మ తమ బావ పెద్ద మల్లయ్య ఇంటికి వెళ్లి విషయం చెప్పింది. ఇద్దరూ కలిసి గ్రామ శివారులోకి వెళ్లగా.. గొడ్డళ్లతో దాడి చేస్తున్న వ్యక్తులు వీరిని చూసి పారిపోయారు. తీవ్ర రక్తగాయాలతో కొట్టుమిట్టాడుతున్న చిన్న మల్లయ్యను వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలాడు. మెట్లకుంట నర్సింహులు, వెంకటేశం, శ్రీను, గొల్ల నర్సింహులు, గొల్ల మల్లేశం కలిసి తన భర్తను చంపేశారని మృతురాలి భార్య సత్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా మృతుడు చిన్న మల్లయ్య ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి, బెయిల్‌పై బయటకు వచ్చాడని గ్రామస్తులు తెలిపారు. ఇతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు.

పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం

మంత్రి సబితారెడ్డి



కంపెనీని ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, కంపెనీ ప్రతినిధులు

మహేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం ఎనిమిదేళ్ల కాలంలో ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో 21 వేల కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. తుమ్మలూరు సమీపంలోని ప్లాస్టిక్ పార్కులో 35 ఎకరాల విస్తీర్ణంలో చిరిపాల్ పాలీఫిల్మ్ కంపెనీని గురువారం ఆమె జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కంపెనీ ప్రతినిధులు, టీఎస్‌ఐఐసీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో టీఎస్ ఐపాస్ ద్వారా ఎలాంటి మధ్యవర్తిత్వం, అవినీతికి ఆస్కారం లేకుండా అతి తక్కువ సమయంలో అన్ని రకాల అనుమతులు అందించి కంపెనీలు స్థాపించేలా పారిశ్రామిక విధానం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం పెట్టుబడిదారులకు సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని మంత్రి తెలిపారు. పారిశ్రామికాభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ అభిమతమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, చిరిపాల్ కంపెనీ చైర్మన్ వేద ప్రకాష్, ఎండీ జై ప్రకాష్ చిరిపాల్, టీఎస్‌ఐఐసీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీపీ రఘుమారెడ్డి, తుమ్మలూరు సర్పంచ్ మద్ది సురేఖ, ఉప సర్పంచ్ కె.శ్రీహరి, ఎంపీటీసీ రామిరెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ భవానీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండలంలోని బేగరికంచె పరిధి, మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న హెచ్‌ఎండీఏ వెంచర్‌ను గురువారం ఆమె టీఎస్‌ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డితో కలిసి సందర్శించారు. వెంచర్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అనంతరం వెంచర్‌లో ఏర్పాటు చేస్తున్న ప్లాట్లను మ్యాప్ ద్వారా పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫార్మాసిటీలో భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 120 గజాల చొప్పున 600 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ ద్వారా అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయిస్తామన్నారు. లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించేలా అధికారుల్ని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ సరళమ్మ, ఎంపీటీసీ కాకి రాములు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, చిర్ర సాయిలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు

యూటీఎఫ్ నేతల విమర్శలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జాతీయ విద్యా విధానం అమలుతో పేద విద్యార్థులకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని.. కుల, మత, భాషా వైషమ్యాలతో విద్యారంగం భ్రష్టుపట్టే ప్రమాదం పొంచి ఉందని.. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేసి శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మాణిక్ రెడ్డి డిమాండ్ చేశారు. తుర్కయంజాల్‌లో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న సంఘం రాష్ట్ర 5వ మహాసభల నేపథ్యంలో గురువారం సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని, నరసింహారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్ నాయక్, వెంకటప్పతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తుంటే.. కేంద్రం మూఢత్వ భావజాలాన్ని, మతతత్వాన్ని పెంపొందిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరుస్తూ విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

క్లుప్తంగా

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

యాలాల: గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను టాస్క్‌ఫోర్సు అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మండలంలోని చెన్నారం శివారులో తాండూరు ప్రాంతానికి చెందిన ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అరవింద్‌కుమార్‌ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కొడంగల్‌ రూరల్‌: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని అంగడిరాయిచూర్‌ గేటు సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకొంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు దౌల్తాబాద్‌ మండల కేంద్రానికి చెందిన కుర్వ నాగప్ప సొంత పనుల నిమిత్తం అంగడిరాయిచూర్‌ వచ్చారు. తిరిగి బైక్‌పై వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నాగప్పకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించగా బాధితుడిని కొడంగల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు హైదరాబాద్‌ రెఫర్‌ చేశారు.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన టీఆర్‌ఆర్‌


మాణిక్‌రావుఠాక్రేతో రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రేను గురువారం గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డితో కలిసి డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి కలిశారు. జిల్లాలోని కాంగ్రెస్‌ పార్టీ స్థితిగతులపై డీసీసీ అధ్యక్షుడిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికలకు కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై ఆరాతీశారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తున్నట్లు టీఆర్‌ఆర్‌ తెలిపారు.

కూలి పనికి వచ్చి యువకుడి మృతి


దశరథ్‌ మృతదేహం

కొందుర్గు: కూలి పనులకు వచ్చిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం జిల్లేడు చౌదరిగూడ మండలం లచ్చంపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి మండలం చౌడాపూర్‌ గ్రామానికి చెందిన దశరథ్‌ (24) కర్రలు కొట్టేందుకు తోటి కూలీలతో కలిసి లారీ పై లచ్చంపేట గ్రామానికి వచ్చాడు. అయితే కర్రలు కొట్టిన అనంతరం వాటిని లారీలో లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు మొద్దు దశరత్‌ పై పడటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

సైబర్‌ నేరగాడి అరెస్టు


రాజ్‌కుమార్‌

కొత్తూరు: అమాయకులకు ఫోన్‌ చేసి మోసగిస్తున్న ఓ సైబర్‌ నేరస్తుడిని పోలీసులు గురువారం అరెస్ట్‌ చేశారు. సీఐ బాలరాజు వివరాల మేరకు మండల పరిధిలోని తీగాపూర్‌కు చెందిన పబ్బె నర్సింహ అవసరాల నిమిత్తం రెండేళ్ల క్రితం కొత్తూరు పట్టణంలోని ఓ బ్యాంకులో బంగారు నగలు కుదువపెట్టాడు. ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లా గుడిపల్లి (వెంకటాపూర్‌)కి చెందిన సల్లూరి రాజ్‌కుమార్‌ గతేడాది నవంబర్‌లో నర్సింహకు ఫోన్‌చేసి మీరు బ్యాంకులో తీసుకున్న రుణానికి వడ్డి చెల్లించాలని లేని పక్షంలో నగలను వేలం వేస్తామని చెప్పాడు. దీంతో నర్సింహ రాజ్‌కుమార్‌కు గూగుల్‌పే ద్వారా రూ.6వేలు చెల్లించాడు. తర్వాత ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ రావడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు నేరస్తుడి అదుపులోకి తీసుకున్నారు.


పరుగులో పాల్గొన్న అబ్బాయిలు

పరుగు.. ఆరోగ్యం మెరుగు

కొడంగల్‌: పరుగుతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొడంగల్‌ సీఐ శంకర్‌, ఎస్‌ఐ రవిగౌడ్‌లు విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక చౌడేశ్వరీ మాత ఆలయం నుంచి మిషన్‌ భగీరథ సంప్‌ హౌస్‌ వరకు 2కె రన్‌ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్‌, డిగ్రీ, లాహోటీ డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులతో పరుగు పందెం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే నడక, పరుగు, యోగాతోనే సాధ్యమన్నారు. ప్రతి రోజు ఉదయం వేళ దూరం నడిస్తే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీహరి, కానిస్టేబుళ్లు గోపాల్‌, నిరంజన్‌, శంకర్‌, మహిళా పోలీసులు సాయి ఐశ్వర్య, పద్మ, రజియా, హోంగార్డులు శ్యాం, హన్మంతు పాల్గొన్నారు.


పరుగులో పాల్గొన్న బాలికలు

బడులు ఇక బలోపేతం

- కేంద్రం ప్రత్యేక నిధులు
- పీఎం శ్రీ పథకం ద్వారా వసతుల కల్పన
- జిల్లాలో 38 పాఠశాలల ఎంపిక
- ఏడాదికి రూ.48లక్షల చొప్పున కేటాయింపు



కుల్కచర్లలోని మోడల్‌ స్కూల్‌

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులను అభివృద్ధి పరిచి మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. మొదట ఎంపిక చేసిన బడిలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు మండలంలోని అన్ని పాఠశాలలకు ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జిల్లాలో 38 పాఠశాలలను ఎంపిక చేసి అందులో ఒక్కో పాఠశాలకు ఏడాదికి రూ.48లక్షల చొప్పున పలు అభివృద్ధి పనులు చేపడతారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో...

విద్యావ్యవస్థ ఉన్నతికి కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ (పీఎం స్కూల్స్‌ ఫర్‌ రైజింగ్‌ ఇండియా) అనే నూతన సంక్షేమ పథకాన్ని అమలుచేస్తోంది. ఈ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలకు ఐదేళ్ల కాలపరిమితిలో ఏడాదికి రూ.48లక్షల చొప్పున వెచ్చించి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఒక్కో మండలంలో ఒక ప్రాథమిక పాఠశాలను, ఒక జెడ్పీ పాఠశాలను ఎంపిక చేస్తారు.

జిల్లా పరిధిలో...

జిల్లాలో 19 మండలాలు ఉండగా ఇందులో 727 ప్రాథమిక పాఠశాలలు, 116 ప్రాథమికోన్నత పాఠశాలలు, 176 జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలు మొత్తం 1019 ఉన్నాయి. ఒక్కో మండలంలో ప్రాథమిక పాఠశాలను, జిల్లా పరిషత్‌ పాఠశాలను ఎంపిక చేయనున్నారు. మండలానికి రెండుచొప్పున జిల్లాలో 38 పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. వీటికిగాను సుమారు రూ.76 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తారు. అంతేకాక ఆదర్శంగా తీర్చిదిద్దుతారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు అమలుచేస్తుండటం శుభపరిణామమని ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు



పీఎంశ్రీ పథకం ద్వారా నిధులు వెచ్చించి పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్‌ స్థాయి సౌకర్యాలు పొందే అవకాశం ఏర్పడుతుంది. సర్కారు బడులకు ఇక మహర్దశే.

– వార్ల సాయికిరణ్‌ గౌడ్‌, ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గసభ్యులు

ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది



పీఎంశ్రీ పథకంలో భాగంగా ఒక్కో మండలంలో రెండు పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం జిల్లా కమిటీకి 5–6 వరకు పాఠశాలలను ఎంపిక చేసి అందజేశాం. జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ ఎంపిక ప్రక్రియను కొనసాగిస్తోంది. ఈ పథకంతో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

– హబీబ్‌ అహ్మద్‌, ఎంఈఓ, కుల్కచర్ల

అనాథలకు అండగా టీవీవీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న టీవీవీ సభ్యులు

కొడంగల్‌: మండల పరిధిలోని టేకుల్‌కోడ్‌ గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) అండగా నిలిచింది. కొన్నేళ్లుగా నిత్యావసర సరుకులు, నగదు, దుస్తులు అందిస్తూ ఆదుకుంటున్నారు. ప్రస్తుతం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యావంతుల వేదిక, కిసాన్‌బంధు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులతో పాటు పండుగకు అవసరమైన సామగ్రిని గురువారం అందజేశారు. పట్టణ శివారులోని సిద్దార్థ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌ గౌడ్‌ అనాథ పిల్లలకు సరుకులు, సామగ్రి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టేకుల్‌కోడ్‌ గ్రామానికి చెందిన రాజు, గణేశ్‌, పూజ, శ్రావణిల తండ్రి పదేళ్ల క్రితం, తల్లి ఐదేళ్ల క్రితం చనిపోయినట్లు చెప్పారు. దీంతో వారు అనాథలుగా మారారని వారికి పూట గడవని పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయం తమకు తెలియడంతో ఐదేళ్ల నుంచి టీవీవీ, కిసాన్‌ బంధు సంస్థ సభ్యుల సహకారంతో ఆదుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది వారికి పుస్తకాలు, నిత్యావసర సరుకులు, నగదు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీవీవీ వికారాబాద్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్‌, తపస్‌ కొడంగల్‌ మండల ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్‌, టీఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌, ఉపాధ్యాయులు కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత


పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో ఇసుక ట్రాక్టర్‌

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌ చేసిన ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని సమాధానం తెలపడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ మూడవత్‌ గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

పకడ్బందీగా నాకాబందీ

232 వాహనాలు సీజ్‌


వికారాబాద్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్‌ఐ తదితరులు

అనంతగిరి: నంబర్‌ప్లేట్స్‌ లేని వాహనాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. నంబర్‌లేకుండా నడిపే వాహనాలే లక్ష్యంగా జిల్లాలో ఆకస్మికంగా నాకాబందీ నిర్వహించినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఆయా పీఎస్‌లో పరిధిలలో చేపట్టారన్నారు. సరైన పత్రాలు, నంబర్‌ప్లేట్స్‌ లేని 232 వాహనాలను సీజ్‌ చేశామన్నారు. ఇందులో వికారాబాద్‌ సబ్‌ డివిజన్‌లో 97, పరిగి 72, తాండూరు 63 వాహనాలు సీజ్‌ చేశారన్నారు. పోలీసులు ఆకస్మికంగా నిర్వహించే నాకాబందీ కార్యక్రమాలకు సహకరించాలని ఆయన జిల్లా ప్రజలకు కోరారు.

నిషేధిత వస్తువులను తరలిస్తే కేసులు

కుల్కచర్ల: నిషేధిత వస్తువులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ గిరి అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా వ్యక్తిగత ధ్రువీకరణపత్రాలు వద్ద ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇస్తే నడిపిన వారితో పాటు వాహనదారులపై కేసులు నమోదుచేస్తామన్నారు.

‘ప్రతిభ’ అబ్బురం.. చిత్రపటమే నిదర్శనం

యాలాలలోని ప్రతిభ పాఠశాలలో విద్యార్థులు వివిధ రంగులతో 80 అడుగుల భారీ వివేకానంద చిత్రపటం వేశారు. భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన గొప్ప నాయకుడు వివేకానందుడని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం పర్యాద రామకృష్ణ, చంద్రశేఖర్‌లు తెలిపారు. విద్యార్థులు ఎంతో కష్టపడి రూపొందించిన చిత్రం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. రవికుమార్‌, మధు, వీరేశం, విజయ్‌,స్నేహ, శిరీష, మౌనిక ఉన్నారు.

– యాలాల



ప్రతిభ పాఠశాలలో 80 అడుగుల భారీ వివేకానందుడి చిత్రపటం

సమన్వయంతో పనిచేస్తేనే గెలుపు


కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌ రెడ్డి

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- దిర్సంపల్లిలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

దోమ: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దిర్సంపల్లిలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్‌ ఎంపీపీ మల్లేశం, పరిగి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌, కుల్కచర్ల మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ హరికృష్ణ, మండల కో ఆప్షన్‌ సభ్యులు ఖాజపాష, పీఏసీఎస్‌ చైర్మన్‌ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మయ్య పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్‌

బైకిస్టుకు తీవ్రగాయాలు

నందిగామ: అతివేగంగా టిప్పర్‌ను నడిపి బైక్‌ను ఢీ కొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన దర్గారోడ్డులో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ రామయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేకగూడ గ్రామానికి చెందిన కంకంటి శ్రీనివాస్‌ రెడ్డి(48) రోజు మాదిరిగానే తన బైక్‌పై వ్యవసాయ పొలంలోకి వెళ్లి వస్తున్నాడు. గురువారం ఉదయం పొలానికి బైక్‌పై వెళ్తుండగా టిప్పర్‌ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ రామయ్య తెలిపారు.

పోడు హక్కులు కల్పించాల్సిందే

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల నిరసన

పరిగి: పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు, గిరిజనులకు ప్రభుత్వం వెంటనే హక్కు పత్రాలను ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతుల దగ్గరకు అధికారులు వెళ్లి విచారణ చేశారన్నారు. చాలా మంది రైతుల దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని తిరస్కరించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏళ్లుగా పోడు భూములను సాగు చేస్తున్న రైతులను అధికారులు గుర్తించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్న రైతుల నుంచి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తోందన్నారు. పోడు రైతుల పక్షాన సీపీఎం పోరాటం చేస్తునే ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ హబీబ్‌, సత్తయ్య, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

- గురువు శివానందాచారి
- ముగిసిన శిక్షణ శిబిరం

ధారూరు: నిత్యం యోగా చేయడం వల్ల శరీరంలోని రుగ్మతలన్నీ తొలగిపోతాయని యోగా గురువు శివానందాచారి తెలిపారు. మండల కేంద్రంలో ఈనెల 3 నుంచి ప్రారంభమైన యోగా శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఆధ్యాత్మికత సైతం పెరుగుతుందని అన్నారు. శిక్షణలో మీరు నేర్చుకున్న 12 రకాల సూర్య నమస్కారాలతో పాటు పద్మాసనం, సూక్తా వజ్రాసనం వంటి వివిధ రకాల ఆసనాలను తరుచూ చేస్తూ ఉంటే బరువు తగ్గడంతో పాటు నిత్యం ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా 15 రకాలతో కూడిన అమృత ఆహారాన్ని శిక్షకులకు అందజేశారు. ఈ నెల 18 నుంచి 29 వరకు రెండో విడత యోగా శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని యోగా గురువు పేర్కొన్నారు.


వజ్రాసనంలో భాగంగా చిన్నారిపై నిలబడిన యోగా గురువు శివానందాచారి

హామీల అమలులో సర్కారు విఫలం

షాద్‌నగర్‌రూరల్‌: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ దాసరి అజయ్‌కుమార్‌ యాదవ్‌ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్‌ యాదవ్‌ హాజరై మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయితే తమ బతుకులు బాగుపడతాయని ప్రజలు భావించారని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్‌ అప్పుల పాలు చేశారని ఆరోపించారు. నిరుద్యోగులు ఉద్యోగాలు వస్తాయని భావిస్తే కేసీఆర్‌ తన కుటుంబ సభ్యులకే ఉద్యోగాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని బార్లు, బీర్ల తెలంగాణగా మార్చారని అన్నారు. దశాబ్దాలు గడుస్తున్నా పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందకపోవడం శోచనీయమని అన్నారు.

అసలే బాలుడు.. ఆపై బైక్‌ నడిపి..

ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

నందిగామ: అసలే బాలుడు.. ఇంట్లో చెప్పకుండా బైక్‌ తీసుకున్నాడు.. అంతటితో ఆగక.. వాళ్ల పెద్దనాన్న కుమారుడు (మైనర్‌)ను వెంటపెట్టుకున్నాడు.. ఇద్దరూ రైడ్‌ చేస్తుండగా బైక్‌ అదుపుతప్పింది. ఈ ఘటనలో ఓ బాలుడు మృతి చెందగా, మరో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని రంగాపూర్‌ గ్రామ సమీపంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. నందిగామ ఇన్‌స్పెక్టర్‌ రామయ్య కథనం ప్రకారం వివరాలు.. రంగాపూర్‌ గ్రామానికి చెందిన తోట విష్ణు వర్ధన్‌ (14) గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రికి చెందిన బైక్‌ను తీసుకున్నాడు. పక్కన్నే ఉన్న పెద్దనాన్న కుమారుడైన చందు(16) ను బైక్‌పై ఎక్కించుకొని గ్రామ సమీపంలోని చెరువుకట్టపైకి రైడ్‌కు వెళ్లారు. దీంతో వారు నడుపుతున్న బైక్‌కు అకస్మాత్తుగా ఓ కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విష్ణు వర్ధన్‌ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుడి తండ్రి సిద్దేశ్వర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ రామయ్య తెలిపారు. సిద్దేశ్వర్‌కు ఉన్న ఒక్క కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.